క్లుప్తంగా

గంజాయి వ్యాపారంపై ఉక్కుపాదం


ఎస్సై శోభన్‌కుమార్

పెదపూడి: సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామని ఎస్సై శోభన్‌కుమార్ అన్నారు. గంజాయి వాడినా, విక్రయించినా.. వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి విషయంలో ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులకు చెప్పారు. ఇందులో భాగంగా మండలంలోని రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామన్నారు. అలాగే రామేశ్వరం గ్రామంలో గంజాయి తాగే అనుమానితుల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడామన్నారు. గంజాయి సరఫరా చేసే, గతంలో గంజాయి కేసులు నమోదైన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలో చోరీల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనుమానితులు గ్రామాల్లో తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అర్చకులు బిక్కవోలు రాఘవరామ్, వంశీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు ,ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈఓ ఆకెళ్ల భాస్కర్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనం


సదస్సులో మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్

రాజమహేంద్రవరం రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనమవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో (సెబ్) నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నిక్సన్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నిక్సన్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాగింగ్ పేరుతో ఎదుటి వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం నేరమనే విషయాన్ని ప్రతి విద్యార్థీ తెలుసుకోవాలన్నారు.

నడవడానికీ నరకయాతనే..

- అధ్వానంగా మారిన రహదారులు
- ఎక్కడికక్కడ గోతులతో తప్పని తిప్పలు
- ప్రయాణానికి అవస్థలు పడుతున్న జనం


రాజానగరం సినిమా థియేటర్ వద్ద ధ్వంసమైన పాత జాతీయ రహదారి


సంపత్‌నగరంలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు

రాజానగరం: అభివృద్ధి చిరునామాగా ఆయా ప్రాంతాలలో రోడ్లను గుర్తిస్తారు. అవి బాగుంటేనే ప్రగతి దిశలో పయనిస్తున్నట్టు భావిస్తారు. అందుకనే రోడ్లకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. కానీ ప్రస్తుతం ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రయాణించాలంటేనే భయపడేలా చేస్తున్నాయి. ఎంత పటిష్టంగా వేసినప్పటికీ ఆయా రోడ్లపై ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉండడంతో తొందరగా పాడైపోతున్నాయి. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు రోడ్లన్నీ ముంపునకు గురయ్యాయి. రాళ్ల లేచిపోయి, తారు కొట్టుకుపోవడంతో వాటిపై ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది.

గుంతలమయం

16వ నంబరు జాతీయ రహదారితో పాటు రాజానగరం, అనపర్తి నియోకవర్గాలలో 1056 కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ, జెడ్పీ, పంచాయతీరాజ్, గ్రామీణ రోడ్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో దాదాపు 352 కిలోమీటర్లు మినహా మిగిలిన రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలావరకు ఛిద్రమైపోయాయి. గుంతలు మయంగా మారిన ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే జనం హడలిపోతున్నారు.

రోడ్ల విస్తరణ

రాజమహేంద్రవరం నుంచి కాకినాడ, విశాఖపట్నం ప్రాంతాలకు ప్రయాణించేందుకు వీలుగా 16వ నంబరు జాతీయ రహదారి రాజానగరం మీదుగా వెళుతుంది. ఈ మండలంలో సుమారు 26 కిలోమీటర్ల వరకూ ఈ రహదారి విస్తరించింది. ఇక్కడ నుంచి కోరుకొండ, సీతానగరం మండలాలను కలుపుతూ ఆర్‌అండ్‌బీ, జెడ్పీ, పంచాయతీ రాజ్ రోడ్లు 496 కిలోమీటర్ల మేర ఉన్నాయి.

అడుగడుగునా..

అనపర్తి మీదుగా కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట పట్టణాలను కలిపే ప్రధాన రహదారితో పాటు బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలను అనుసంధానిస్తూ ఆర్‌అండ్‌బీ, జెడ్పీ రోడ్లు 560 కిలోమీటర్ల వరకూ ఉన్నాయి. వీటిలో ఆర్‌అండ్‌బీ, జెడ్పీ, పంచాయతీరాజ్ రోడ్లే కాకుండా రాజానగరం నుంచి కాకినాడ వరకు ఉన్న ఏడీబీ రోడ్డు కూడా ప్రయాణికుల సహనాన్ని పరీక్షించే రోడ్లలో ప్రధానమైనదిగా ఉంది. ఈ పరిస్థితులలో తానేమీ తీసిపోలేదన్నట్టుగా 16వ నంబరు జాతీయ రహదారి కూడా గుంతలతో భయపెడుతోంది.

నాణ్యత, నిర్వహణ లోపాలే కారణం

నాణ్యత, నిర్వహణ లోపాలే రోడ్లు త్వరగా పాడైపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. గతంలో రోడ్డును అభివృద్ధి చేసేటప్పుడు పైలేయర్ పూర్తిగా తవ్వేసి, కొత్తగా వేసేవారు. అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో నేడు మెషీన్లతో పాడైన రోడ్డును పైపైన గోకి, ఆపై కంకర, తారు మిశ్రమాన్ని పూతపూస్తున్నారు. దీని వలన గోతులు పడిన ప్రాంతంలో అనతికాలంలోనే ఆ గోతులు తిరిగి దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు గతంలో రోడ్ల పై ఎక్కడా నీరు నిలిచివుండకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండేవారు. అయితే ఆ విధమైన సిబ్బంది నియామకాలు లేకపోవడంతో రోడ్లపై శాఖాపరమైన పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

పాడైపోతున్న రోడ్లు

ఇదే సమయంలో ఆక్రమణలు కూడా తోడవడంతో రోడ్లపై కురిసిన వర్షం నీరు కూడా దిగువ పోయేందుకు సరైన మార్గాలు లేక, నీరు నిలిచిపోయి పాడైపోతున్నాయి. ఇది సరిపోదన్నట్టుగా కొన్నిచోట్ల రోడ్లనే మురుగు కాలువలుగా వాడుతున్న నేపథ్యంలో రోడ్లు పాడైపోతున్నాయనేది వాస్తవం. ఇటువంటి పరిస్థితులతో సిమెంటు రోడ్లు కూడా పాడైపోయి, మట్టిరోడ్లుగా మారిపోతున్నాయి. ఇటువంటి వాటిలో ముందు వరసలో రాజానగరం – కాకినాడ ఏడీబీ రోడ్డు నిలుస్తుంది. ఆ తరువాత స్థానంలో రాజానగరం – కలవచర్ల, బలభద్రపురం – రామచంద్రాపురం, అనపర్తి – రామచంద్రాపురం, అనపర్తి – రాజానగరం, అనపర్తి – వీరవరం, రంగంపేట – బలభద్రపురం, వడిశలేరు – గానుగూడెం, కోరుకొండ – ముగ్గళ్ల, కోరుకొండ – గాదరాడ, బూరుగుపూడి – ఉండేశ్వరపురం, కోటికేశవరం – నాగంపల్లి, రాఘవపురం – బొల్లెద్దుపాలెం, సీతానగరం – పురుషోత్తపట్నం రోడ్లు ఉన్నాయి.

రోడ్డుపైకి మురుగునీరు



సంపత్‌నగరంలో బొమ్మూరు నుంచి కేశవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పైకి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మురుగు నీటిని వదిలేస్తున్నారు. దీనితో అటువైపు రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బంది కలగడమే కాకుండా రోడ్డు కూడా పాడైపోతోంది. మురుగు నీరు పోయేందుకు పక్కా డ్రైనేజీ సిస్టమ్‌ని ఏర్పాటు చేసి, రోడ్డు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– సుంకర వెంకట్రావు, రాజవోలు

మరమ్మతులు చేసి ఏడాది కాలేదు



రాజానగరంలో పాత జాతీయ రహదారికి మరమ్మతులు చేసి ఏడాది కూడా కాలేదు, అప్పుడే ఎక్కడ గోతులు అక్కడే అన్నట్టుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సినిమా థియేటర్ వద్ద రాకపోకలు సాగించేందుకు కూడా వీలులేనంతగా రోడ్డు దెబ్బతింది. ఇక్కడ ఉన్న కల్వర్టులు మూసుకుపోయి దశాబ్దాలు కావొస్తున్నా, పాలకులు పట్టించుకోకపోవడమే దీనికి ప్రధాన కారణం.

– సత్య త్రిమూర్తులు, శ్రీరామ్‌నగర్

ఎంపీడీఓగా నరేష్ కుమార్



మధురపూడి: కోరుకొండ మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా పీఎస్ నరేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలానికి బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి యథాస్థానానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మండల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని దేవిగుడి సెంటర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సాధ్య హోమియోకేర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉండవల్లి ప్రియాంక పర్యవేక్షణలో శిబిరం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు ఉచితంగా వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేస్తారని వివరించారు.

ఎంపీడీఓ ఆశాజ్యోతి విశాఖకు బదిలీ

పెదపూడి: ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.ఆశాజ్యోతి శుక్రవారం విశాఖపట్నానికి బదిలీ అయ్యారు. ఈమె గత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా చింతపల్లి మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. ఆమె ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి విశాఖపట్నం హెడ్‌క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో స్థానిక ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

విశేషాలంకరణల్లో అమ్మవార్లు


విశేష అలంకరణలో ఈలకొలను ముత్యాలమ్మ తల్లి


బిక్కవోలులో పార్వతీదేవి అమ్మవారు


కొమరిపాలెంలో కనక దుర్గమ్మ తల్లి

రంగంపేట: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలో ఇంటింటా వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. వరలక్ష్మీ దేవికి ప్రీతిపాత్రమైన రోజుగా భావించి మహిళలు తమ ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. గ్రామాల్లోని దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకోవడంతో, మండలంలోని పలు అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. ఈలకొలను గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలక కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

బిక్కవోలు: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిక్కవోలు పార్వతీదేవి, అలాగే కొమరిపాలెం కనకదుర్గమ్మ, తొస్సిపూడి నవదుర్గ, పందలపాక కట్లమ్మ తల్లి, ఊలపల్లి గ్రామంలోని జి.మామిడాడ రోడ్డులోని కనక దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మిగిలిన అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెదపూడి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలను మహిళలు శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. జి.మామిడాడలో ప్రసిద్ధిచెందిన సూర్యనారాయణ మూర్తి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమపూజలు చేశారు. మండలంలోని సంపర, పెద్దాడ, రామేశ్వరం, కాండ్రేగుల గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో కొలువైన కనక దుర్గమ్మను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి దర్శించుకున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా విజయలక్ష్మికి ఆలయ అర్చకులు, కమిటీ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు దాడి వీరబాబు, దాడి శివాజీ, పార్టీ నాయకులు తనకాల ప్రసాద్, సూరిశెట్టి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యుడు తనకాల నూకరాజు, దుర్గమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు జొమ్మల సూర్యనారాయణ, తనకాల వెంటరమణ పాల్గొన్నారు.


శ్రీరంగపట్నం దుర్గమ్మ ఆలయంలో కొబ్బరికాయ కొడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి


జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి ఆలయంలో సామూహిక వ్రతాలు

గైట్ విద్యార్థులకు ఉత్తమ వలంటీర్ అవార్డులు


మూడు పురస్కారాలను అందుకుంటున్న లక్ష్మీ లలిత్య

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు కె.లక్ష్మీ లలిత్య, షేక్ మోమినాకు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఉత్తమ వలంటీర్ అవార్డులు లభించాయి. 2022–23, 2023–24 సంవత్సరాలకు ప్రకటించిన ఈ అవార్డులను ఆంధ్రవిశ్వ కళాపరిషత్ కులపతి జి.శశిభూషణరావు ఆ విద్యార్థులకు అందజేశారు. ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, సమాజ సేవ, ఆరోగ్యం, జలసంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, ప్రజా చైతన్యం కల్పించినందుకుగాను లక్ష్మీ లలిత్య మూడు పురస్కారాలను అందుకుంది. ఎంఎస్ఎస్ ఫణీషా, ఎన్‌జీ సాయికుమార్‌లకు 2022–23, జి.సాయిశశాంక్, పి.సుచిత్రకు 2023–24 సంవత్సరాలలో అందించిన సేవలను అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా అభినందించారు.

'జాంపేట' ఎన్నికలకు పూర్తయిన నామినేషన్లు


నామినేషన్లను స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి జగన్నాథరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏడు పాఠశాలలోని 25 పోలింగ్ కేంద్రాలలో ఈ నెల 25న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన నామినేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తయ్యింది. ఈ ఎన్నికలను మూడు నియోజక వర్గాలుగా విభజించారు. రాష్ట్రంలో 10 బ్రాంచ్‌లతో కొనసాగుతున్న ఈ బ్యాంక్‌లో 27,724 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 12 మంది డైరెక్టర్ల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్టు ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం నామినేషన్ల పరిశీలన, ఆదివారం ఉపసంహరణ, 25వ తేదీన ఎన్నికలు, 26వ తేదీన రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

సర్దార్ గౌతు లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయకం


గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సీటీఆర్ఐ: సర్దార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కొనియాడారు. స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన విగ్రహాలకు నివాళర్పించారు. వై.జంక్షన్ లోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జాతిని జాగృతి పరిచి సంఘీయుల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు మార్గాని నాగేశ్వరరావు, బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు సోము వీర్రాజు, టీడీపీ రాష్ట్ర నాయకుడు గన్ని కృష్ణ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కంబాలచెరువు: కోల్‌కతాలోని ఆర్జికార్ వైద్యకళాశాల ఆసుపత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.భానుప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, రాజమహేంద్రవరం పట్టణ కార్యదర్శి దినేష్ కుమార్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మన్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నల్లబ్యాడ్జిలు ధరించి ఫస్ట్ ఎయిడ్ సర్వీసెస్ నిలుపుదల చేస్తూ నిరసన తెలియజేస్తామన్నారు.

వయ్యారి భామతో అనేక అనర్థాలు

- కలుపుమొక్క నివారణపై వారోత్సవాలు
- కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం


కేవీకేలో వయ్యారి భామ నివారణ వారోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు

రాజానగరం: వయ్యారిభామ (పార్థీనియం)గా పిలువబడే కలుపు మొక్క చాలా అందంగా కనిపిస్తుంది. మన పరిసరాల్లో చాలాచోట్ల విపరీతంగా పెరుగుతుంది. కానీ దీని వల్ల అనేక చర్మ రోగాలు వస్తాయి. మనుషులతో పాటు పశువులు, ఇతర పంటలకు కూడా నష్టం కలుగుతుంది. ఈ నేపథ్యంలో వయ్యారిభామ నివారణకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శుక్రవారం అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా ఈ నెల 22 వరకూ వీటిని నిర్వహిస్తారు. ఈ మొక్క వల్ల కలిగే అనారోగ్య సమస్యలను కేవీకేలో ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు వివరించారు.

అత్యంత ప్రమాదకారి

వయ్యారిభామ అత్యంత ప్రమాదకారి అయిన ఈ కలుపు మొక్క. ఇది సుమారు రెండు మీటర్ల ఎత్తు వరకూ ఎదుగుతుంది. దీని ఆకులు చీలికలతో కూడి సన్నటి నూగులాంటి రోమాల మాదిరిగా ఉంటాయి. మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాల లోగానే పూత దశకు వస్తుంది. ఒక్కో మొక్క 10 వేల నుంచి 25 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వీటి విత్తనాలు పైభాగంలో జుత్తు ఉండడం వల్ల గాలి, నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్ల ద్వారా సులువుగా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తాయి. ఈ మొక్కలోని అన్ని భాగాల్లో (కాండం, ఆకులు, కొమ్మల పై నూగు, పుప్పొడి) పార్థినిస్ అనే విష పదార్థం ఉంటుంది. ఈ విషం వలన మానవాళికి, పశువులకు వివిధ రకాల రోగాలు సంభవిస్తాయి.

దుష్ప్రభావాలు

- మన ప్రాంతంలో వయ్యారి భామగా పిలిచే పార్థీనియం మొక్కల పుప్పొడి వల్ల మనుషుల్లో శ్వాస కోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా), చర్మ వ్యాధులు, విష జ్వరాలు, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయి. వీటి ఆకులను చర్మానికి రాసుకుంటే తామర వచ్చేస్తుంది. పుప్పొడిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడటం, కను రెప్పలు వాపు వస్తాయి.
- పశువులకు కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మ వ్యాధులు సోకుతాయి. వీటి స్పర్శతోనే జంతువులకు వెంట్రుకలు రాలిపోవడం జరుగుతుంది. పశువులలో పాల ఉత్పత్తి తగ్గి, బరువు కోల్పోతాయి.
- ఈ మొక్కలు ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా స్రవించి ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. ఇవి ఉన్న ప్రాంతంలో వేరొక మొక్కలు బతకవు.
- త్వరగా పెరిగే గుణం ఉండటంతో వేరుతో పెకలించకుండా వీటిని కోస్తే మరలా త్వరగా పెరిగిపోతాయి.
- పంట పొలాలలో విపరీతంగా వ్యాపించడమే కాకుండా ఆయా పంటలకు వేసిన ఎరువుల సారాన్ని కూడా పీల్చివేస్తాయి, తద్వారా పంటలను ఎదగకుండా చేయడంతో పాటు దిగుబడులు గణనీయంగా పడిపోతాయి.
- ఈ మొక్కల పుప్పొడి వల్ల టమాటా, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు, పాదులు పూత రాలిపోయి, కాయ ఏర్పడకుండా నిరోధిస్తాయి.
- వివిధ పంటలకు సోకే పిండి నల్లికి ఈ మొక్కలు నివాస స్థలాలుగా ఉపయోగపడతాయి.

సమగ్ర నివారణ పద్ధతులు

- పార్థీనియం మొక్కలను నివారణను గ్రామాల్లోని రైతులందరూ తమ పొలాల్లో సామూహికంగా చర్యలు చేపట్టాలి. పూత రాక ముందే ఈ మొక్కలను వేర్లతో సహా పీకి, తగులబెట్టాలి. ఆపై ఎక్కడైనా మొక్కలు మొలిస్తే వెంటనే వాటిని కూడా వేర్లతో సహా పెకలించాలి. ఈ విధంగా నాలుగైదు సంవత్సరాలు చేస్తేనే వీటిని పూర్తిగా నివారించవచ్చు.
- వేసవిలో పొలాలను లోతుగా దుక్కి చేయడం వలన కలుపు విత్తనాలు కూడా లోతుకు పోయి మొలకెత్తవు. తద్వారా పార్థీనియం ఉత్పత్తి తగ్గుతుంది.
- వీటి ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాలలో బంతి పంట మార్పిడి సాగు ద్వారా కూడా కలుపును నివారించవచ్చు.
- జై గో గ్రామా, బై కొలరేటా అనే కీటకాలు ఈ మొక్కల ఆకుల, కాండాన్ని తినడం ద్వారా సమర్థంగా నివారించవచ్చు. పొలంలో ఈ మొక్కల తీవ్రతను అనుసరించి 500 నుంచి వెయ్యి వరకు పైన పేర్కొన్న కీటకాలను వదలడం ద్వారా వాటి సంతతి కూడా వద్ధి చెందుతూ పెద్ద, చిన్న కీటకాలు ఈ మొక్కలను సమగ్రంగా ఆరగిస్తాయి.
- పైరు సాగు చేయని పొలాల్లో ఈ కలుపు మొక్క పూత దశకు రాకముందే ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం (లీటర్ నీటికి 150 లేదా 200 గ్రాములు) పిచికారీ చేయాలి. వేసవిలో ఎకరాకు గ్లైఫోసేట్ ఒకటి లేదా 1.5 లీటర్లను పూత దశకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా కూడా వీటి ఉధృతిని తగ్గించవచ్చు.